క్లుప్తంగా

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతుబజార్‌కు నేడు సెలవు ఉందని రైతుబజార్ ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతినెలా మూడో బుధవారం సెలవు ఉన్నందున నేడు రైతు బజార్‌లో ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని ఆమె పేర్కొన్నారు. గురువారం మళ్లీ యధావిధిగా రైతుబజార్‌లో క్రయ విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విజయశాంతికి ఆహ్వానం



మన్సూరాబాద్: సామ రంగారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్న మహిళా దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని బీజేపీ నాయకురాలు విజయశాంతిని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మంగళవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణవేణి, గీతారెడ్డి పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న డా. ప్రత్యూష

చంచల్‌గూడ: టీబీ వ్యాధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలకు సంబంధించి మంగళవారం కుర్మగూడ డివిజన్‌లోని బస్తీ దవాఖానాలో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. టీబీ ప్రాణాంతక వ్యాధి కాదని, చికిత్సలు ఉన్నాయని వైద్యులు పేర్కొన్నారు. టీబీ బాధితులు నిరాశకు గురికాకుండా, ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. ప్రత్యూష, డా. ఇష్రత్, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్లో సెల్‌ఫోన్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణికుడి సెల్‌ఫోన్ చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్మాస్‌గూడకు చెందిన దీనానాథ్ కాచిగూడకు వచ్చేందుకు రేణిగుంటలో చెన్నై – చెంగల్‌పట్టు రైలు ఎక్కాడు. రైలు కర్నూల్ రైల్వే స్టేషన్ వద్దకు రాగానే అతడి సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. మంగళవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న దీనానాథ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పోలీసులకు కేసును బదిలీ చేశారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై విచారణ జరిపించాలి

కాచిగూడ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై హైకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యులైన ఉన్నతాధికారులను పదవుల నుంచి తొలగించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లీకేజీ కారణంగా వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారన్నారు.

నేటి నుంచి ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

కాచిగూడ: శ్రీ శ్యామ్‌మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ శ్యామ్‌మందిర్ ప్రాంగణంలోని ఫిజియోథెరపీ సెంటర్‌లో పక్షవాతానికి ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించనున్నట్లు హ్యుమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండా శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఉచిత ఫిజియోథెరపి వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు సెల్: 9949238492లో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కాచిగూడ: విద్యార్థినులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కేర్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి అన్నారు. విద్యార్థినులకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించేందుకు మంగళవారం బద్రుకా కళాశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. పీసీఓఎస్, పీసీఓడీ తదితర సమస్యలు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్రెస్ట్ కేన్సర్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బద్రుక హెల్త్ సెంటర్ డాక్టర్ పూర్ణ చంద్రమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ ఎం.జానకి రామ్, ఈవీసీఎం శాస్త్రీ, ఎన్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మమత, జె.లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలి

జలమండలి ఎండీకి కార్పొరేటర్ల వినతి



జలమండలి ఎండీ దానకిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా నత్తనడకన నడుస్తున్న యూజీడీ పైప్‌లైను పనులు, తవ్వకాల వల్ల పగిలిన తాగునీటి పైప్‌లైన్‌ను పునరుద్ధరించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ పలువురు కార్పొరేటర్లు జలమండలి ఎండీ దాన కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. చైతన్యపురి, గడ్డిఅన్నారం, వనస్థలిపురం, హయత్‌నగర్ కార్పొరేటర్లు రంగా నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి మంగళవారం జలమండలి ఎండీని కలసి కాలనీలలో ప్రజలు ఎదర్కొంటున్న సమస్యలను వివరించారు. ఉచిత తాగునీటి సరఫరా అని చెప్పి అధిక బిల్లులు విధించి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గం పరిధిలో ఎస్ఎన్‌డీపీ పనులు జరుగుతున్నాయని, ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ ఛిన్నాభిన్నం అయిందన్నారు. నత్తనడక పనుల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొటున్నారని, లో ప్రెజర్ నీటి సరఫరాతో తాగునీరు సరఫరా అవుతున్నా నీటి బిల్లులు మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మూడేళ్లుగా వర్షం దాటికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని, వందల కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే ప్రకటిస్తున్నా పనులు మాత్రం నత్తనడకన నడుస్తున్నాయని ఎండీకి వివరించారు.

సుందరీకరణ పనుల పరిశీలన



సుందరీకణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: డివైడర్ల మధ్య ఉన్న చెట్లను ఏపుగా పెంచి అత్యంత సుందరీకరణ చేయనున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సాగర్‌రింగ్ రోడ్డు నుంచి ఇబ్రహింపట్నం వెళ్లే రహదారి మధ్య చెట్ల సుందరీకరణ పనులను ఆయన సాగర్ కాంప్లెక్స్ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరమంతా అందంగా కనిపించాలని, రోడ్లు శుభ్రంగా ఉండి రోడ్లపై ప్రయాణించే వారికి ఈ రోడ్డును కనువిందు చేసే విధంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. చెట్లు గుబురుగా పెరిగి మంచి ఆకృతి ఇస్తాయని దీంతో ఈ ప్రాంతం అంత సుందరంగా ఉంటుందని చెప్పారు. ఈ పనులు పూర్తి అయితే ఆగస్టు నుంచి మంచి ఆకర్షనీయంగా ఈ రోడ్డును ప్రయాణికులు చూస్తారని తెలిపారు. దీంతో పాటు చింతల్‌కుంట వద్ద అండర్‌పాస్, నాగోల్ వద్ద కూడా ఇలాంటి పనులను చేపట్టడం జరుగుతోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ సుజాతనాయక్, నాయకులు అరవింద్‌రెడ్డి, సత్యంచారి, రాంబాబు, శ్రీనివాస్‌నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. మూసారంబాగ్, శాలివాహననగర్, గడ్డిఅన్నారం, అక్బర్‌బాగ్, శంకర్‌నగర్, పద్మానగర్, దయానంద్ నగర్, ఆనంద్‌నగర్, కాలడేరా కాలనీ, ఫర్హత్‌నగర్, ఉస్మాన్‌పుర, చంచల్‌గూడ ప్రాంతాలకు చెందిన 30 మందికి లబ్ధిదారులకు రూ.30,03,480 లు విలువ చేసే చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. ప్రభుత్వం ఈ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డల పెళ్లిలకు తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ ఆర్ఐ హరిబాబు, అంబర్‌పేట ఆర్ఐ శ్రీకాంత్, చార్మినార్ ఆర్ఐ సాయికిరణ్, మహ్మద్ రిజ్వాన్, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై కాంగ్రెస్ నేతల రాస్తా రోకో



దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చైతన్యపురి: టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షల లీకేజీకి నిరసనగా మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీకి చెందిన లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా రాజీవ్ చౌక్ చేరుకుని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో 9 ఏళ్ల తరువాత ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చిందని, నిరుద్యోగులు ఎంతో ఆశగా పోటీ పరీక్షలు హాజరైతే లీకేజీ కారణంగా వారి జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రెసిడెంట్ మిద్దెల జితేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వినీత్, నాయకులు గాంధినాయక్, భాస్కర్‌యాదవ్, చందు, రంజిత్, ఆమీర్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాను శాశ్వతంగా పరిష్కరించాలి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: మోహన్‌నగర్ బస్తీలో డ్రైనేజ్ మురుగు తాగునీటిలో కలవకుండా శాశ్వతంగా పరిష్కరించాలని జలమండలి అధికారులకు కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. మోహన్‌నగర్ బస్తీలో ఎన్నో రోజుల నుంచి డ్రైనేజ్ నీరు తాగునీటిలో కలుస్తుండడంతో ప్రజలు ఎంతగానో ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక కార్పొరేటర్ మూడు రోజుల క్రితం బస్తీలో పర్యటించి సమస్యను జలమండలి జీఎం, డీజీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే వారు స్పందించి మంగళవారం కొత్తపేట మోహన్‌నగర్ బస్తీలో జలమండలి జీఎం బలరాం, డీజీఎం శ్రీనివాస్ అధికారులు పర్యటించారు. సమస్యను కనిపెట్టే అత్యాధునిక టెక్నాలజీతో కెమెరాలతో కూడిన నూతన పరికరంతో మొట్టమొదటిసారిగా కొత్తపేట్ డివిజన్లో ప్రయోగించడం జరిగింది. దానిద్వారా కలుషితం ఎక్కడ జరుగుతుందో కనిపెట్టి మరో రెండు రోజుల్లో ఇలాంటి కలుషితం లేకుండా పైప్‌లను మార్చుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామకృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ ఆరిఫ్, దయాకర్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, నాయకులు ఉపేందర్‌సింగ్, కొత్త తిరుమల, సైదుల్ బాబాయ్ పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

బడంగ్‌పేట్: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1994–95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 29 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు జ్ఞాపకాలను నెమరేసుకుని ఆనందంగా గడిపారు. వారి పాఠశాల అభివృద్ధికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న 1994-95 బ్యాచ్ ఆకుతోటపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

మహిళలకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సులోచన తదితరులు

అంబర్‌పేట: తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న మహిళా నేతలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యురాలు డాక్టర్ సులోచన అన్నారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన మహిళలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికైనా గుర్తించాలని కోరారు. ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తులకు సైతం ఎన్నో అవకాశాలు ఇచ్చారని, తమలాంటి వారికి కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణలో మహిళలకు ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. సమావేశంలో పల్లవి, అరుణ, వైశాలి, బాలమణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

హయత్‌నగర్: టీవీఎస్ ఎక్సల్‌ను డీసీఎం ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మన్సూరాబాద్ డివిజన్‌లోని వీరన్నగుట్ట కాలనీలో నివసించే శ్యామల(సమ్మక్క)(50) తన భర్త సోమయ్యతో కలిసి జైపురి కాలనీ నుంచి వీరన్నగుట్ట వైపు టీవీఎస్ ఎక్సల్ వాహనంపై వస్తున్నారు. రావినారాయణరెడ్డి కాలనీ సమీపంలోని పాపయ్యగూడ చౌరస్తా వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం టీవీఎస్‌ను ఢీ కొట్టింది. దీంతో టీవీఎస్ వెనుక సీటులో ఉన్న శ్యామల రోడ్డుపై పడింది. ఆమె తలపై డీసీఎం టైరు వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హతమార్చిన వ్యక్తికి యావజ్జీవ కారాగారం

రంగారెడ్డి కోర్టులు: భార్యను హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.భవాని చంద్ర, కోర్టు ఏపీపీ. జి కస్తూరి తెలిపిన వివరాల ప్రకారం.. 2016 సెప్టెంబర్‌లో సరూర్‌నగర్ ఠాణా పరిధిలో నమోదైన యువతి ష్యాంకి భాయ్ హత్య కేసులో నిందితుడైన భర్త హలావత్ శంకర్(34) పెళ్లయిన సంవత్సరం నుంచి పిల్లలు పుట్టట్లేదని భార్యను వేధించడం మొదలు పెట్టాడు. నిందితుడు భార్యకి తెలియకుండా రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య అయిన మృతురాలిని ప్రతీ చిన్న విషయానికి అనుమానించి తిట్టడం, కొట్టడం చేసేవాడు. ఈ తరుణంలో ఒకరోజు నిందితుడు పనిపూర్తి చేసుకుని ఇంటికి చేరుకునే సమయానికి భార్య వేరొకరితో మాట్లాడడం గమనించి ఆమెను గొంతు నులిమి హతమార్చి అక్కడి నుంచి పరారయ్యాడు.మృతురాలి తండ్రి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి, కేసు విచారించి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు మంగళవారం నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

ఏటీఎంలో చోరీకి యత్నం



దుండగులు ధ్వంసం చేసిన ఏటీఎం

చైతన్యపురి: ఏటీఎం ధ్వంసం చేసి డబ్బు చోరీకి విఫలయత్నం చేసిన ఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మదుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వీఎంహోమ్ మెట్రో స్టేషన్ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎంలోకి సోమవారం అర్ధరాత్రి చొరబడిన దుండగులు చోరీకి యత్నించారు. ఏటీఎం మిషన్‌ను పగలగొట్టి ఎంత ప్రయత్నించినా చోరీకి వీలు కాకపోవటంతో వదిలేసి వెళ్లారు. ఉదయం గమనించిన బ్యాంక్ సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, సీసీ ఫుటేజ్ పరిశీలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గృహహింస కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

రంగారెడ్డి కోర్టులు: గృహ హింస కేసులో ఓ వ్యక్తికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు రంగారెడ్డి జిల్లా మూడవ అదనపు మెట్రోపాలిటన్ మ్యాజిస్ట్రేట్ న్యాయమూర్తి కొత్త రవి. కోర్టు పీపీ. గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం .. నిందితుడు సైదులు(32) వివాహమై ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సైదులు భార్యను నిత్యం వేధించేవాడు. పలుమార్లు భార్యకు అబార్షన్ చేయించాడు. ఇదిలా ఉండగా భర్త రోజులు తరబడి ఇంటికి రాకపోవడం, ఇంట్లో తన బంగారం కూడా కనిపించకపోవడంతో భర్త తీరుపై అనుమానంతో తన గురించి వాకబు చేయగా భర్త మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని నిర్ధారించుకుని భర్తని నిలదీసింది. కొద్ది రోజుల తరువాత పండగకి ఇంటికి వచ్చిన నిందితుడు తన చిన్న కూతురిని అర్ధరాత్రి ఇంట్లో నుంచి తీసుకుని పరారయ్యాడు. ఈ విషయమై ప్రశ్నించిన భార్యకు తన అవసరాల కోసం పాపని అమ్మేస్తానని నిందితుడు చెప్పడంతో బాధితురాలు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేయగా కేసు విచారించిన కోర్టు పైవిధంగా మంగళవారం తీర్పు వెలువరించింది.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



గడ్డిఅన్నారంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన లింగాల హరిగౌడ్

సైదాబాద్: ఎండాకాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం గడ్డిఅన్నారం చౌరస్తాలో దివంగత లింగాల దయాకర్‌గౌడ్, సక్కుబాయి స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి, పాదచారులకు ఆయన తాగునీరు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకీ పెరుగుతున్న ఎండల తీవ్రతతో గడ్డిఅన్నారం పరిసరాలలో సంచరించే వారికి ఉపయుక్తంగా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసామన్నారు. ఎండాకాలం పూర్తయ్యే వరకు ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ బప్పు, లక్ష్మారెడ్డి, నవీన్‌కుమార్, లింగాల చంద్రకాంత్‌గౌడ్, రాజీవ్, శశిరాజ్, హన్మంత్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా గుర్తింపు కార్డుల పంపిణీ

నాగోలు: భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వం అందజేసే ప్రమాద బీమాను ఉపయోగించుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు బొడ్డుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ ద్వారా జారి చేసిన అసంఘటిత రంగ భవన నిర్మాణ కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా గుర్తింపు కార్డులను మంగళవారం న్యూ నాగోలు కాలనీలో ఎస్‌కే డాంగే భవనం , సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయంలో లబ్ధి దారులకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ఈ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉప్పల్ మండల పార్టీ నాయకులు మల్లేష్, లలిత, రాములు, సురేష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులను అందజేస్తున్న సీపీఐ నాయకుడు కృష్ణ తదితరులు

అజయ్‌కుమార్‌కు సన్మానం



మన్సూరాబాద్: జీయోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో డైరెక్టర్ నుంచి డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పదోన్నతి పొందిన అజయ్‌కుమార్‌ను ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జీఎస్ఐలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కష్టపడి నిబద్ధతతో విధులు నిర్వహిస్తే ఫలితం తప్పకుండా దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, లింగయ్య, రాజశేఖర్, చక్రేశ్వర్, ఆనంద్‌కుమార్, మల్లేష్, యాదయ్య, వెంకటేశ్వర్‌రావు, ఉషయ్య, మనోజ్‌కుమార్, అమరనాథ్ పాల్గొన్నారు.

మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలి



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

హస్తినాపురం: మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పిలుపునిచ్చారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండిపుల్లారెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలకు మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికారితతోనే సమానత్వం సాధ్యమవుతుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ తీసుకొచ్చిందని చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. మహిళలకు రాజకీయ రంగంలో అధిక ప్రాధాన్యతనిచ్చింది కాంగ్రెస్ పార్టీ నేని, మహిళల వంటింటి కష్టాలను తీర్చేందుకు రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో సరఫరా చేస్తున్నారని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బీఎన్‌రెడ్డి నగర్ ఫేజ్–1కాలనీలో వెలసిన దాసాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు జరిగే ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా నిర్వహించే బ్రోచర్‌ను ఆలయ కమిటీ సభ్యులతో కలసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రాజిరెడ్డి మాట్లాడుతూ.. బుధవారం విఘ్నేశ్వర పూజ, స్వస్తిపుణ్యాహవాచనము, రక్షాబంధనము, పంచగవ్యప్రాశనము, తోరణపూజ, హోమం, గురువారం ఉదయం 8గంటలకు కలశాభిషేకం, యాగమండపారాదన, గణపతియాగం, నవగ్రహ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు శుక్రవారం ఆచార్య పరిపద్ధానందగిరి స్వామి పవిత్ర హస్తములచే ఉదయం 11:5 గంటలకు కన్యాలగ్న పుష్కరాంశ సుముహూరమున దాసాంజనేయ ఆలయ ధ్వజ ఉత్సవాహన అమ్మవారి సింహవాన యంత్ర విగ్రహ ప్రతిష్ఠలు జరపబడుతాయని నిర్వాహకులు తెలిపారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీని విజయవంతం చేయాలి



సమావేశానికి హాజరైన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల పెద్దలు

మలక్‌పేట: గుడ్ ఫ్రైడేని పురస్కరించుకుని నిర్వహించనున్న రన్‌ఫర్ జీసస్–2023 ర్యాలీని విజయవంతం చేయాలని ఎంబీ చర్చి పాస్టర్ రెవరెండ్ మెన్నోజోయల్ పిలుపు నిచ్చారు. మంగళవారం నల్లగొండ క్రాస్ రోడ్‌లోని ఎంబీ చర్చిలో జరిగిన సన్నాహక సమావేశానికి మలక్‌పేటలోని చర్చిల పాస్టర్లు, పెద్దలు హాజరయ్యారు. ఆరాధన టీవీ సౌజన్యంతో చేపట్టనున్న రన్‌ఫర్ జీసస్ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ర్యాలీలో యువత అధిక సంఖ్యలో భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. కో–ఆర్డినేటర్ డాక్టర్ సాల్మన్‌రాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాస్టర్ శ్రీనివాస్ హర్బర్ట్, శ్యామ్, జయరాజ్ బెంజిమిన్, విద్యాధర్‌రావు, అనిల్‌కుమార్, యువరాజ్, మనోహర్, వెరోనిక, ఆరాధన టీవీ ప్రతినిధి జాన్‌పాల్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.